క్లుప్తంగా

ఇసుక టిప్పర్ పట్టివేత

ధన్వాడ: మండలంలోని కొండాపూర్ గ్రామ శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కంసాన్‌పల్లి గ్రామంలో ఇసుకను డంప్ చేసి వెళ్తున్నట్లు పక్కా సమాచారం వచ్చిందని ఎస్‌ఐ రమేష్ తెలిపారు. విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

స్టైఫండ్ ఇవ్వాలి

మాగనూర్: తెలంగాణాలో జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ. 5 వేల స్టైఫండ్ ఇవ్వాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌ను బీజేపీ యువమోర్చా రాష్ట్ర లీగల్ కన్వీనర్ నరేందర్ సాగర్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలో స్టైఫండ్ ఇస్తున్నారన్నారు.

డ్రెయినేజీ పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

మాగనూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే దారిలో నూతనంగా నిర్మిస్తున్న డ్రెయినేజీ పనులు అసంపూర్తిగా వదిలేయడంతో ఎన్‌హెచ్–167 పైకి మురుగు నీరు వచ్చి చేరుతుందని ఆదివారం సాక్షి దినపత్రికలో '' అసంపూర్తి పనులతో ఇబ్బందులు'' అనే వార్త ప్రచురితం అయ్యింది. ఈ క్రమంలో అధికారులు స్పందించారు. దీంతో సంబంధిత రోడ్డు కాంట్రాక్టర్ అసంపూర్తిగా ఉన్న డ్రెయినేజీని పూర్తి చేసేందుకు పనులు ప్రారంభించారు. దీంతో పలువురు సంతోషం వ్యక్తం చేశారు.


పనులు చేయిస్తున్న కాంట్రాక్టర్

క్రీడాకారుడికి ఆర్థిక సాయం

దామరగిద్ద: మండలంలోని ఎస్సీకాలనీకి చెందిన క్రీడాకారుడు చింతచెట్టు కన్కప్ప జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. అదేవిధంగా ఫిబ్రవరి 19 న బంగ్లాదేశ్ లో జరగనున్న పారా ఒలంపిక్స్ క్రీడల్లో పాల్గొనేందుకు అవసరమైన ఆర్థిక సాయంకోసం నారాయణపేట లయన్స్ క్లబ్ ను సంప్రదించారు. కాగా ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయపేట గవర్నర్ లయన్ హరినారాయణ బట్టడ్ సమక్షంలో రూ. 25 వేల నగదును క్రీడాకారుడికి అందజేశారు. వ్యాయమ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు కతలప్ప, దామరగిద్ద మాజీ సర్పంచ్ రవీందర్ పాల్గొన్నారు.

కంకర తేలిన రోడ్డు



ధన్వాడ: మండల కేంద్రం నుంచి పాతపల్లి వరకు ఉన్న రోడ్డు కంకర తేలడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాతపల్లి గ్రామంతో పాటు కొత్తపల్లి, ఊట్కూర్ వరకు, అదేవిధంగా ధన్వాడకు నిత్యం ప్రజలు వివిధ అవసరాల నిమిత్తం ఈ దారి గుండా ప్రయాణిస్తుంటారు. ఈ క్రమంలో గుంతలమయంగా మారి, కంకర తేలిన రహదారిపై ప్రయాణం చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతులు చేయాలని ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని అని గ్రామస్తులు వాపోతున్నారు. ఇకనైనా పరిష్కరించాలని కోరుతున్నారు.

దేశ సేవలో ముందుండాలి

నారాయణపేట రూరల్ : మండలంలోని శేర్నపల్లికి చెందిన కేశవ్, ఆనంద్‌యాదవ్‌లు అగ్నివీర్‌కు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం ఆ యువకులను గ్రామస్తులు అభినందించారు.


యువకులను సన్మానిస్తున్న గ్రామస్తులు

మరికల్: దేశ సేవలో యువత ముందుండాలని బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షులు రాజేష్ అన్నారు. మండల కేంద్రం నుంచి సూరిటి శివ, వరప్రసాద్‌రెడ్డి, అరవింద్ రెడ్డి, కుమ్మరి లక్ష్మణ్, అనిల్‌యాదవ్, భరత్, శివరాములు ఆర్మీలో ఉద్యోగాలకు ఎంపికైన సందర్భంగా వారిని ఘనంగా సన్మానించి అభినందించారు. హన్మిరెడ్డి, నాగరాజ్, ప్రవీణ్, నవీన్‌లు పాల్గొన్నారు.

మాగనూర్: మండల కేంద్రంలోని నందకుమార్, జయంత్‌లు అగ్నిపత్‌కు ఎంపికవ్వడంతో ఆదివారం గ్రామానికి చెందిన పెద్దలు, యువకులు ఘనంగా సన్మానించారు. నర్సింహరెడ్డి, మహాదేవ్, వర్కూర్ అంజనేయులు, వాకిటి వాబయ్య తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్ద: మండలంలోని మద్దెల్‌బీడ్‌కు చెందిన అంజనేయులు, నర్సాపూర్‌కు చెందిన నరేష్‌లు శనివారం విడుదలైన ఆర్మీ రిక్రూట్ మెంట్ ఫలితాల్లో ఎంపికయ్యారు. దీంతో వారిని ఆయా గ్రామాల ప్రజలు అభినందించారు.

'మతం విషయం మాట్లాడ లేదు'

మరికల్: పల్లెగడ్డలో జరిగిన గణతంత్ర వేడుకల్లో తాను మతం గురించి మాట్లాడలేదని, జెండా ఎగరవేయనని అనలేదని కొందరు గ్రామస్తులు వక్రీకరించి విలేకర్లకు చెప్పారని అంగన్‌వాడీ టీచర్ ఎస్తేర్ ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. కేవలం పూజ మాత్రమే చేయనన్నానని అయినా కావాలనే ఆయాతో జెండాను ఎగురవేయించి తనను ఇబ్బందులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

రేపటి నుంచి జాతర

నారాయణపేట రూరల్ : జిల్లాలో అత్యంత వైభవంగా జరిగే వాటిలో ఒకటైన లింగంపల్లి జాతర ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 31న గ్రామంలో శ్రీఎల్లమ్మతల్లి విగ్రహ ఊరేగింపు, అమ్మవారికి పెద్ద బోనం కుండ, సాయమ్మనోటికి తాళం ఘట్టం, అలంకరణ, పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. దీంతో ఇప్పటికే జాతర ప్రాంగణంలో పారిశుద్ధ్య చర్యలు, తాగు నీటి వసతి, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు.

రేపు ద్విచక్రవాహన వేలం

నారాయణపేట: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ నారాయణపేట సర్కిల్ పరిధిలో ఓ కేసులో పట్టుబడిన ఒక ద్విచక్ర వాహనాన్ని మంగళవారం ఉదయం 11గంటలకు వేలం వేయనున్నట్లు సీఐ వై.నాగేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనదలచిన వారు ఉదయం 10.30 గంటలకు రూ.వెయ్యి ధరావత్తు చెల్లించి పాల్గొనాలని తెలిపారు.

వాల్‌పోస్టర్ల విడుదల

మాగనూర్: తెలంగాణ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 01న కలెక్టరేట్ ఎదుటా ధర్నా కార్యక్రమం చేపడుతున్నట్లు, జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి యస్ కిరణ్ తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని వాడ్వట్ గ్రామంలో గోడపత్రికలు విడుదల చేశారు. నాయకులు సంజీవ్, అంజప్ప, యాదయ్య, అంజనేయులు, భీమప్ప, డి. అంజప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎన్నిక

మరికల్: మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులుగా ఆంజనేయులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం గజ్జలమ్మ దేవత ఆలయ ఆవరణలో జరిగిన సమావేశంలో ఎన్నిక నిర్వహించారు. నారాయణ, కుర్మన్న, సత్యన్న, శ్రీను, రాములు, నారాయణ పాల్గొన్నారు.

నేటి నుంచి ఉత్సవాలు

ఊట్కూరు: మండలంలోని పెద్దజట్రం గ్రామశివారులోని నందనవనం బద్రినారాయణస్వామి సన్నిధిలో సోమవారం నుంచి మాధ్వ నవమి వేడుకలు మూడు రోజులపాటు ఘనంగా చేపడుతున్నట్లు నిర్వాహకులు శ్రీధర్‌రావు ఆదివారం తెలిపారు. ముంబయి విద్యా పీఠం హరీష్ ఆచార్య, ఉడిపి కానూర్ మఠం విద్వాన్ అనీల్ దేశాయిలతో ఆధ్యాత్మిక ప్రవచనాలు, భజనలు నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆవుదూడకు వైద్యం

నారాయణపేట టౌన్ : పట్టణంలోని శాతవాహన కాలనీలో ఆదివారం రోడ్డుపై లేవలేని స్థితిలో ఉన్న ఆవుదూడను గమనించి బజరంగ్‌దళ్ నాయకులు స్థానిక పశువైద్య కార్యాలయానికి సమాచారం ఇచ్చారు. దీంతో పశువైద్య సిబ్బంది అక్కడి చేరుకొని చికిత్స అందించారు. రోడ్ల వెంబడి తిరుగుతున్న పశువులను బందరు దొడ్డికి తరలించాలని పదే పదే యాజమానులకు, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. శాతవాహన కాలనీలో ఎవరిదైనా వాహనంతో ఢీకొని ఉంటుందని, లేదా దాడి చేసి ఉంటారని పశువైద్య సిబ్బంది తెలిపారు. ప్రమాదాలు జరిగి జంతువుల ప్రాణాలు పోతున్నాయని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని బజరంగ్ దళ్ కార్యకర్తలు డిమాండ్ చేశారు.

'అనుచిత వ్యాఖ్యలు సరికావు'

మరికల్: వరుసగా హిందు ధర్మంపై ఆరోపణలు, విమర్శలు చేస్తున్న వారిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని విశ్వహిందు పరిషత్ సభ్యులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దిగంబర్ కాంబ్లే అనే వ్యక్తి హిందూ దేవతలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వారిని దేశం నుంచి తరమివేయాలని, ప్రభుత్వం కఠిన చట్టాలను తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో అనిల్, రవి, వెంకటేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఊట్కూరు: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు కె ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని పులిమామిడి గ్రామంలో ఆదివారం క్రికెట్ టోర్నమెంట్ బహుమతుల ప్రదానోత్సవానికి విచ్చేసి మాట్లాడారు. గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి ప్రశాంత్‌రెడ్డి రూ.30 వేలు, రెండవ బహుమతి తిమ్మారెడ్డి రూ.20 వేలు నగదు, మెమెంటోలను అందించారు. సర్పంచ్ సూరయ్యగౌడ్, తిమ్మారెడ్డి, పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నారాయణపేట టౌన్ : కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ చలో ఢిల్లీ కార్యక్రమాన్ని ఏప్రిల్ 5న చేపట్టనున్నట్లు, విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షులు వెంకట్రామిరెడ్డి, కన్వీనర్ బాల్‌రాం పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రలోని అంబేద్కర్ భవన్‌లో జరిగిన సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలన్నిటిని కుదించారని, ఇది కార్మికులను, యాజమాన్యాలకు కట్టు బానిసలుగా ఉండే దుస్థితిని తీసుకొస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. నూతనంగా తీసుకువచ్చిన కోడ్‌లను రద్దు చేయాలన్నారు. జిల్లా కో–కన్వీనర్ ఆంజనేయులు, వీవోఏ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భీమేష్, శ్రీనివాస్, క్షేత్ర సహాయకుల సంఘం రాష్ట్ర నాయకులు కాశీనాథ్, భీమ్‌సేన్, కృష్ణయ్య, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి చంద్రప్ప, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా నాయకులు వెంకటయ్య, రవి, సుమిత్ర పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

నర్వ: మండల కేంద్రంలో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం నిర్వహిస్తున్నట్లు బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే పాల్గొని కేక్ కట్ చేస్తారన్నారు. గ్రామాల ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మాగనూర్: ఎమ్మెల్యే చిట్టెం జన్మదిన వేడుకలు సోమవారం శ్రీలక్ష్మీనర్సింహస్వామి దేవాలయం ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బ్యాంకు సేవలు వినియోగించుకోవాలి

ఊట్కూర్: మండల ప్రజలు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ మేనేజర్ ప్రవీణ్ కుమార్ కోరారు. ఊట్కూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం రాత్రి మహిళ సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బ్యాంకు ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు సురేశ్ లింగం, పీ. నారాయణ, బ్యాంకు సిబ్బంది గౌరిశంకర్, గ్రామస్తులు తొగటి నర్సిములు, కోరి బసంత్‌కుమార్ పాల్గొన్నారు.

నాన్‌టీచింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి


పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నర్వ: కేజీబీవీలలోని నాన్‌టీచింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలంటూ ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం నర్వ కస్తూర్బా గురుకుల పాఠశాలలో పోస్టర్‌లను ఉద్యోగులతో కలిసి ఆవిష్కరించారు. ఈ నెల 30న, నిర్వహించే ధర్నా విజయవంతం చేయాలని కోరారు. వర్కర్లు నాగేంద్రమ్మ, నర్మద, సునీత, సుశీలమ్మ, అయ్యమ్మ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం తప్పనిసరి

మరికల్: ప్రతి ఒక్కరూ తమ ఓటర్ కార్డుకు ఆధార్ కార్డును తప్పనిసరిగా అనుసంధానం చేయించుకోవాలని తహసీల్దార్ రామ్‌కోటి అన్నారు. ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండలంలో మిగిలిన ఓటరు కార్డులను శర వేగంగా ఆధార్‌కు అనుసంధానం చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. వందశాతం పూర్తి చేసేలా బీఎల్‌ఓలు, వీఆర్‌ఏలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో గోపాల్‌రావు, సుధాకర్‌రెడ్డి, శ్రీశైలం, రవి, మంజుల, శివ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కృష్ణా: మండలంలోని నది తీర ప్రాంతాల్లో సాగు చేసిన వరి పంటలకు వారం రోజులుగా వివిధ రకాల తెగులు వస్తున్నాయని, రైతులు తక్షణమే తగు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి సుదర్శన్‌గౌడ్ సూచించారు. విలేకరులతో మాట్లాడుతూ వరిలో ఆకుముడత, కట్ వామ్స్ అనే తెగులు కనిపిస్తున్నదని, అందుకు గాను రైతులు నోవాలర్న్, ఇండోక్స్‌కార్బ్‌ను ఎకరాకు 175 మి.లీ పిచికారి చేయాలని సూచించారు. వివరాలకు సంప్రదించాలని కోరారు.